క్లుప్తంగా

రూ.2.57 లక్షలు పలికిన గణేశ్ లడ్డూ


వినాయకుడి గ్రామోత్సవం

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలో వినాయక చవితి సందర్భంగా భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్య విగ్రహానికి సోమవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు. గణనాథునికి నైవేద్యంగా ఉంచిన లడ్డూను వేలం వేయగా రికార్డు స్థాయిలో రూ.2.57 లక్షలకు కుడితిపల్లి గ్రామానికి చెందిన గుండుబోయిన వెంకయ్య దక్కించుకున్నారు. అలాగే వినాయకుని మెడలో అలంకరించిన నగదు మాలను రూ.2.47 లక్షలకు కొండూరుసత్రానికి చెందిన దావులూరు చెన్నకేశవులు దక్కించుకున్నారు. వినాయకుని ప్రతిమ కలిగిన వెండి కాయిన్‌ను రూ.35 వేలకు మనుబోలుకు చెందిన నీలిశెట్టి సుమతి దక్కించుకున్నారు.

మురళీకృష్ణకు జ్యోతిష్య జ్ఞానరత్న అవార్డు


డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ

ముత్తుకూరు : ముత్తుకూరుకు చెందిన జ్యోతిష్య శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణకు 'జ్యోతిష్య జ్ఞానరత్న' అవార్డు వరించింది. ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్(యూఏఎస్ఏ) ద్వారా ఆయనకు ఈ అవార్డు లభించింది. జ్యోతిష్య శాస్త్రంలో విశేషమైన కృషి చేసినందుకు ఈ అవార్డు ప్రకటించగా, ఇది మంగళవారం కొరియర్ ద్వారా ఆయనకు చేరింది.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

కోవూరు : మండలంలోని అన్ని గ్రామాల రైతులు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.పద్మజ అన్నారు. కోవూరు మండలం కేసుంటపాడు, ఇనమడుగు, పడుగుపాడు గ్రామ పంచాయతీల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఉన్న సమస్యలను గ్రామసభల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్‌లు వెట్టి రాజగోపాల్‌రెడ్డి, డి.ప్రమీలమ్మ, లక్ష్మీనారాయణ, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గురుకులంలో ఓరియెంటేషన్ ప్రోగ్రాం

ముత్తుకూరు : ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో జిల్లాలోని 8 గురుకుల పాఠశాలలకు సంబంధించి బోధన, బోధనేతర సిబ్బందికి ఓరియెంటేషన్ ప్రోగ్రాం మంగళవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా జిల్లా సమన్వయకర్త టి.హేమలత ఆధ్వర్యంలో జూనియర్ లెక్చరర్లు, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లకు వారి సబ్జెక్టులకు సంబంధించి అవగాహన సమావేశాలు జరిపారు. నెల్లూరు కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు జోష్‌బాబు, అలివేలు మంగాబాయి తదితరులు సీబీఎస్ఈపై అవగాహన కల్పించారు. బుధవారం కూడా అవగాహన కార్యక్రమం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపల్ సుజాత తెలిపారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



పొదలకూరు : మండలంలోని నావూరు జెడ్పీహైస్కూల్‌లో 120 మంది విద్యార్థులకు పాఠశాల పూర్వవిద్యార్థి నావూరు వెంకట మురళీమనోజ్‌కుమార్ మంగళవారం ఆయన తల్లి హైమావతమ్మ చేతులమీదుగా మధ్యాహ్న భోజన ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి కుటుంబసభ్యులు, హెచ్ఎం ఈ.అనిల్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను చేశాం

కోవూరు : పడుగుపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు అవసరమైన అన్ని పనులను నిజాయతీగా చేస్తున్నామని, కొందరు కావాలనే లేనిపోని విమర్శలు చేస్తున్నారని సర్పంచ్ లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. కోవూరు మండలం వడుగుపాడు పంచాయతీలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. చంద్రమౌళి నగర్ ప్రాంతంలో ప్రజలకు అవసరమైన సిమెంట్ రోడ్లు, మురికి కాలువలను నిర్మించామని, అవసరమైన వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. అయితే నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

తప్పుడు రాతలు తగవు

కోవూరు(బుచ్చిరెడ్డిపాలెం) : తనపై పచ్చమీడియా తప్పుగా ప్రచారం చేయడం తగదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గత ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో తాను అలిగి వెళ్లిపోయినట్లు రాయడాన్ని ఆయన ఖండించారు. మరోసారి ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు : గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మనుబోలు మండల కేంద్రంలోని పలు అభివృద్ధి పనులకు ఆయన మంగళవారం ప్రారంభోత్సవాలు నిర్వహించారు. తొలుత స్థానిక దళితవాడ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సీసీ రోడ్లు, సైడు డ్రెయిన్లు, జగనన్న కాలనీకి జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి వసతి తదితర రూ.95 లక్షల విలువైన అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం స్థానిక సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఒక్క మనుబోలు గ్రామంలోనే రూ.12.30 కోట్ల విలువైన అభివృద్ధి పనులను గత నాలుగేళ్లలో పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు శిలాఫలకాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఇందుకు భిన్నంగా తాము అభివృద్ధి పనులకు నిధులను కేటాయించడమే కాకుండా వాటిని పూర్తి చేసి ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. అన్నివర్గాల సంక్షేమానికి ప్రాముఖ్యతనిస్తూనే అభివృద్ధి పనులకు కూడా అడిగిన వెంటనే సీఎం వైఎస్ జగన్ నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. అందుకే ప్రతిపక్షాలు ఎంత దుష్ప్రచారం చేసినా జాతీయ సర్వేల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి ఘన విజయం సాధించడం ఖాయమనే విషయం వెల్లడైందన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఇనాం విలేజ్‌గా ఉన్న కుడితిపల్లిని గ్రామస్తుల కోరిక మేరకు సెటిల్మెంట్ విలేజ్‌గా మార్పు చేసి ఎన్నో దశాబ్దాలుగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపామన్నారు.

బాబుకు మద్దతు కరువు

స్కిల్ కేసులో అరెస్టయిన చంద్రబాబుకు ప్రజల నుంచి కనీస మద్దతు కరువైందని మంత్రి కాకాణి అన్నారు. బాబుకు మద్దతుగా టీడీపీ దీక్షలు చేపడితే రెండున్నర లక్షల ఓటర్లు ఉన్న సర్వేపల్లి నియోజకవర్గంలో కనీసం 250 మంది కూడా సంఘీభావం తెలపలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, ఏడెం మల్లికార్జునరెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, నారపరెడ్డి కిరణ్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, కిశోర్‌నాయుడు, రవీంధర్‌రెడ్డి, నవకోటి, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేష్, కేవీఆర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయండి


పోస్టర్లను ఆవిష్కరించిన సీపీఎం నేతలు

పొదలకూరు : జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఎం ఈనెల 6వ తేదీ నుంచి తలపెట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు కె.పెంచలనరసయ్య తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని విరువూరు గ్రామం నుంచి పాదయాత్రను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పాదయాత్రను పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ ప్రారంభిస్తారన్నారు. ఈనెల 13న నెల్లూరు నర్తకి సెంటర్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బి.మనోహర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో ఏబీవీపీ నిరసన


వీఎస్‌యూ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నేతలు

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ వీఎస్‌యూ పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఇన్‌స్టెంట్ పరీక్షలు నిర్వహించేందుకు వీఎస్‌యూ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు రాసిన విద్యార్థులు రెండు నెలల నుంచి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారని, ఫలితాలు విడుదల చేయకుండా ఇన్‌స్టెంట్ పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. ఈ పరీక్ష ఫలితాలు విడుదల చేసిన తరువాతే ఇన్‌స్టెంట్ పరీక్షలు జరపాలని డిమాండ్ చేశారు.

పదోన్నతి పొందిన సెక్రటరీకి సన్మానం



పొదలకూరు : నాలుగేళ్లుగా పొదలకూరు పంచాయతీ గ్రేడ్-1 సెక్రటరీగా పనిచేస్తూ పదోన్నతిపై ఈఓపీఆర్డీగా వెళ్తున్న ఎస్‌కే అల్లాభక్షును స్థానిక సచివాలయం బిట్-1 వద్ద పాలకమండలి సభ్యులు మంగళవారం సన్మానించారు. ముందుగా పంచాయతీ గ్రామసభను సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం సెక్రటరీ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్ల పాటు వివాద రహితుడిగా సేవలు అందించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోమా అరుణ, ఎంపీటీసీ సభ్యులు జి.లక్ష్మీల్యాణి, జి.శ్రీనివాసులు, వార్డుసభ్యులు ఎస్‌కే అంజాద్, కె.వాసుదేవరావు, హేమంత్, ప్రసాద్, మూలి సతీష్‌రెడ్డి, భాస్కర్, హరి, విజయలక్ష్మి, మూర్తిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు దస్తగిరి, లక్కాకుల ఆనంద్‌రావు, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌కే ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయం వద్ద బ్లాక్ డే


డీటీకి వినతిపత్రం అందజేత

ముత్తుకూరు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ముత్తుకూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట మంగళవారం బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు గడ్డం అంకయ్య, నక్కారాధయ్య, దుంపల ఏడుకొండలు తదితరులు కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. మోహనరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


అభివృద్ధి పనులపై చర్చిస్తున్న అధికారులు

- ఎంపీపీ ఉప్పల స్వర్ణలత

తోటపల్లిగూడూరు : గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగుతోందని ఎంపీపీ ఉప్పల స్వర్ణలత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ క్రమంలో తాగునీరు, పారిశుద్ధ్యం, గృహనిర్మాణాల పురోగతి, ఉపాధిహామీ పథకం పనులపై అధికారులు చర్చించారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష, 'గడప గడపకు మన ప్రభుత్వం' ద్వారా పరిష్కారమవుతున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్వర్ణలత మాట్లాడుతూ మండలాధికారులతో పాటు గ్రామస్థాయి అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ హేమలత మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో మండలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, మండల ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, కంజి నీలమ్మ, ఎంపీడీఓ హేమలత, తహసీల్దార్ లావణ్య, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు రాయపు శీనయ్య, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జనరంజక పాలన


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో జనరంజక పాలన అందిస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మైపాడు పడమరపాళెం బీసీ కాలనీ, కృష్ణాపురం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 1.02 లక్షల గృహాలు ఉండగా ఇప్పటికే లక్షకు పైగా ఇంటిని సందర్శించామన్నారు. లక్ష గడపలు పూర్తయిన సందర్భంగా ఇటీవల స్థానిక నేత దువ్వూరు కళ్యాణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ సభ నిర్వహించామన్నారు. ఇందులో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేశారన్నారు. ఏ గడపకు వెళ్లినా ప్రజలు సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలుస్తున్నట్లు చెప్పారు. అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో నగదును జమ చేస్తుండడంతో పేదలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతోందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, ప్రజలందరూ ఆయన్ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు, సీఐ కె.రామకృష్ణారెడ్డి, పార్టీ నేతలు పామంజి నరసింహ, శ్రీహరికోట ప్రసాద్, కూనంగారి రమణయ్య, చిన్నయ్య, చంద్రమోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, స్థానిక శివాలయ చైర్మన్ సురేంద్ర, సర్పంచ్ సంగం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సీహెచ్‌సీలో రక్తదాన శిబిరం

పొదలకూరు : పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తామని వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ మంగళవారం తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలు, పట్టణానికి చెందిన యువకులు, సామాజిక కార్యకర్తలు శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాల్సిందిగా కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పొదలకూరు : స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఐదో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.మురళీధర్ మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ఈనెల 7వ తేదీలోగా అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించాల్సిందిగా సూచించారు. సివింగ్ టెక్నాలజీ, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, హార్టికల్చర్ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఎలాంటి కాల్ లెటర్స్ పంపమన్నారు. అభ్యర్థులు ఈనెల 8వ తేదీన సాయంత్రం 5 గంటల్లోగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఐదోవిడత కౌన్సిలింగ్ పొదలకూరుకు సమీపంలోని చిట్టేపల్లి వద్ద ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు నూతన ఐటీఐ కళాశాల భవనంలో నిర్వహిస్తామని చెప్పారు. పైన తెలిపిన కోర్సుల వివరాలకు సంబంధించి సివింగ్ టెక్నాలజీ 81850 88996, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ 89851 19940, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ 94948 31200, హార్టికల్చర్ 88868 86144 నంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు.

రేబిస్ నివారణే లక్ష్యంగా..

- ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా ఏఆర్వీ మందు
- అప్రమత్తత అవసరమంటున్న వైద్యులు


ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కోవూరు : రేబిస్ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రతి పీహెచ్‌సీ పరిధిలో కుక్కకాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో జనాభాను బట్టి 50 నుంచి 80 వరకు, సీహెచ్‌సీలో 200 వరకు ఏఆర్వీ ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచుతున్నారు. అంతేకాకుండా కుక్కలను పట్టుకెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించి తిరిగి వదిలేస్తున్నారు. దీనివల్ల వీధికుక్కల సంఖ్య పెరగకుండా ఉండడంతో పాటు రేబిస్ రాకుండా ఉండేలా చర్యలు చేపట్టారు. కోవూరు నియోజకవర్గంలో ఇనమడుగు, ఎల్లయ్యపాళెం, రామతీర్థం, విడవలూరు, జేజేపేట, ఇందుకూరుపేట, జొన్నవాడ, బుచ్చిరెడ్డిపాళెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.

జాగ్రత్తగా ఉండాలి




కుక్కకాటును నిర్లక్ష్యం చేయకూడదు. ఇందులో మూడు కేటగిరీలు ఉన్నాయి. వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకోవాలి. వీటిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉంది.

– డాక్టర్ చలపతి, కోవూరు

కుక్క కరిస్తే ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- కుక్క కరిచిన వెంటనే గాయాన్ని శుభ్రంగా కడగాలి. అనంతరం వైద్యుని వద్దకు వచ్చి చికిత్స తీసుకోవాలి. అతి పెద్ద గాయాలైతేనే కట్టుకట్టాలి. చిన్న గాయాలను కట్టుకట్టకుండా వదిలేయాలి.
- కుక్కకాటు తరువాత యాంటి రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్వీ) వేయించుకోవాలి
- మొదటి, మూడో, ఏడో, 14వ, 30వ రోజు వ్యాక్సిన్ వేస్తారు.



కుక్కకాటుకు వేసే ఇంజెక్షన్

ప్రజారోగ్యానికి పెద్దపీట

- జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన


కొడవలూరు : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. మండలంలోని గౌతమ్ నగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ పథకం ప్రవేశపెట్టినా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు దేశంలోనే ఎక్కడా లేవన్నారు. అనంతరం నిర్వహించిన శిబిరంలో ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు మనీష్, ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు రాజశేఖర్, పీహెచ్‌సీ వైద్యులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓ జి.వసంతకుమారి, ఎంపీపీ గాలి జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సర్పంచ్ నాగిరెడ్డి సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి షబ్బీర్ పాల్గొన్నారు.

సూరాయపాళెంలో..

పొదలకూరు : మండలంలోని సూరాయపాళెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వివిధ రకాల జబ్బులను పరీక్షించుకునేందుకు తరలివచ్చారు. మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహారావు పర్యవేక్షణలో తహసీల్దార్ కె.వీరవసంతరావు ఆధ్వర్యంలో క్యాంపును ఏర్పాటు చేశారు. హెల్ప్‌డెస్క్ ద్వారా క్యాంపునకు వచ్చిన రోగులను సిబ్బంది వైద్యనిపుణుల వద్దకు పంపారు. సర్వేలో అందజేసిన టోకెన్ల ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు చేయించనున్నారు. ఈ క్యాంపులో డాక్టర్లు కిరణ్‌రిషిత, స్పెషలిస్టులు డాక్టర్ ఎస్‌కే షహలా, డాక్టర్ వెంకటశివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

మనుబోలు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు సూచించారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సిబ్బంది ఇళ్ల వద్దకే వెళ్లి ప్రజలకు అవసరమైన ఏడు రకాల వైద్య సేవలను అందజేస్తారని తెలిపారు.

మనుబోలులో ఆరోగ్య సర్వే

మనుబోలు మండల కేంద్రంలో ఈనెల 12న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో వలంటీర్లతో కలిసి వైద్య సిబ్బంది మంగళవారం ముమ్మరంగా సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించడంతో పాటు ఎవరెవరికి ఎలాంటి అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక రోగాలు ఉన్నాయి.. అనే వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమాల్లో అక్కంపేట సర్పంచ్ జాంబవతమ్మ, మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, ఏఓ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యం

ఇందుకూరుపేట : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని పున్నూరు గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలకు స్పెషలిస్ట్ డాక్టర్లు వచ్చి వైద్య సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్రబాబు, ఈఓపీఆర్డీ వసుంధర, మైపాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయశంకర్, శ్రావణి, ఎంపీటీసీ బాలబొమ్మ కరుణాకర్, ఏఎంసీ మండల చైర్మన్ గొల్లపల్లి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.


పొదలకూరు : రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యనిపుణుడు


మనుబోలులో ఆరోగ్య సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది


ఇందుకూరుపేట : మాట్లాడుతున్న విజయ్‌కుమార్